సాక్షి మహబూబాబాద్

శుక్రవారం । 27 । అక్టోబర్ । 2023



గంజాయి పట్టివేత

వరంగల్ రైల్వేస్టేషన్ ఎదుట ఓ వ్యక్తి వద్ద రూ.5.50లక్షలు విలువ చేసే గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

- 10లో▸



అధికారులు నిబద్ధతతో పనిచేయాలి

విద్యుత్ అధికారులు నిబద్ధతతో పనిచేయాలని ఎన్పీడీసీఎల్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ అన్నమనేని గోపాల్‌రావు అన్నారు.

- 10లో▸

గరిష్ఠం/కనిష్ఠం

36.7^{0} / 25.9^{0}

వాతావరణం

జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండతో పాటు ఉక్కపోతగా ఉంటుంది. రాత్రి చలి తీవ్రత ఉంటుంది.

న్యూస్‌రీల్

నిబంధనలు పాటించాలి



నర్సింహులపేట: ప్రజలు ఎన్నికల నిబంధనలు పాటించాలని తొర్రూరు డీఎస్పీ వెంకటేశ్వరబాబు అన్నారు. గురువారం మండల కేంద్రంతో పాటు పడమటిగూడెంలో కేంద్ర బలగాలతో పోలీస్ కవాతు నిర్వహించారు. మండల కేంద్రంలో చివరలో ఉన్న బంక్ నుంచి చౌరస్తా, పొట్టి శ్రీరాములు విగ్రహం, శివాలయం, హైస్కూల్ సెంటర్, అంబేడ్కర్ సెంటర్ మీదుగా పీఎస్ వరకు పోలీస్ కవాతు నిర్వహించారు. సీఐ సత్యనారాయణ, ఎస్సై గండ్రాతి సతీష్, సిబ్బంది పాల్గొన్నారు.

గంజాయి రవాణా కేసులో ఒకరికి జైలుశిక్ష

నవభారత్(భద్రాద్రి కొత్తగూడెం): గంజాయి తరలిస్తూ పట్టుబడిన వ్యక్తికి 12ఏళ్ల కఠిన కారాగారశిక్ష, రూ.లక్ష జరిమానా విధిస్తూ కొత్తగూడెం మొదటి అదనపు జిల్లా జడ్జి ఎం.శ్యాంశ్రీ గురువారం తీర్పు చెప్పారు. కేసు వివరాలిలా ఉన్నాయి. 2020 ఆగస్టు 9న భద్రాచలంలో వాహనాల తనిఖీ చేపట్టగా కారులో గంజాయితో వెళ్తున్న మహబూబాబాద్ జిల్లా కలకత్తాతండాకు చెందిన వాంకుడోత్ బలరాం అలియాస్ బాలు, విశాఖ జిల్లా చింతపల్లికి చెందిన కొర్ర దొరబాబు, ఖమ్మం రాపర్తినగర్‌కు చెందిన ముత్తినేని కిషన్‌కుమార్, మహబూబాబాద్ జిల్లా గూడూరుకు చెందిన వాంకుడోత్ రమేష్ పట్టుబడ్డారు. ఛత్తీస్‌గఢ్ నుంచి తీసుకొస్తున్న 200 కేజీలకు పైగా గంజాయి లభించింది. దీంతో భద్రాచలం టౌన్ సీఐ టి.స్వామి కేసు నమోదు చేసి కోర్టులో చార్జీషీట్ దాఖలు చేశారు. ఈమేరకు విచారణ అనంతరం వాంకుడోతు బలరాంపై నేరం రుజువు కావడంతో 12ఏళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.లక్ష జరిమానా విధించారు. ఇక దొరబాబు, ముత్తినేని కిషన్‌కుమార్‌పై నేరం రుజువు కాకపోవడంతో కొట్టివేయగా, వాంకుడోత్ రమేష్ ఆచూకీ తెలియకపోవడంతో కేసు పెండింగ్‌లో పెట్టారు. ప్రాసిక్యూషన్ తరఫున ఏపీపీ రావి విజయకుమార్ వాదించగా ఎం.హరిగోపాల్, గంజి శశిధర్ సహకరించారు.

మానుకోటకు సీఎం కేసీఆర్

నేటి ప్రజా ఆశీర్వాద సభకు ఏర్పాట్లు పూర్తి

- జిల్లా కేంద్రం శనిగపురం రోడ్డులో సభా వేదిక సిద్ధం
- భారీగా జన సమీకరణకు సన్నాహాలు
- పోలీసుల భారీ బందోబస్తు

సాక్షి, మహబూబాబాద్: అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తుండడంతో బీఆర్ఎస్ పార్టీ ముమ్మరంగా ప్రచారం చేస్తోంది. ఇప్పటికే టికెట్లు ఖరారు చేసి బీఫాంలు అందజేసిన పార్టీ అధినేత, సీఎం కేసీఆర్ నియోజకవర్గాల బాటపట్టారు. శుక్రవారం మానుకోటలో జరిగే భారీ బహిరంగ సభకు హాజరుకానున్నారు. ఈమేరకు పట్టణంలోని శనిగపురం రోడ్డులో పది ఎకరాల స్థలంలో సభ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. కాగా భారీ సంఖ్యలో ప్రజలను తరలించేందుకు నాయకులు సిద్ధమయ్యారు. మంత్రి సత్యవతిరాథోడ్ సభా వేదిక ఏర్పాట్లను దగ్గరుండి పర్యవేక్షించారు.

మధ్యాహ్నం 2గంటలు సీఎం సభ

ప్రజా ఆశీర్వాద సభ మధ్యాహ్నం 2గంటలకు ప్రారంభం కానుంది. మానుకోట ఎమ్మెల్యే అభ్యర్థి బానోత్‌శంకర్ నాయక్‌ను,బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని మరోసారి ఆశీర్వదించాలని సీఎం కేసీఆర్ కోరనున్నారు. తొలుత ఖమ్మం జిల్లా పాలేరు నియోకవర్గంలో నిర్వహించే సభకు సీఎం హాజరవుతారు. అక్కడి నుంచి మహబూబాబాద్ సభకు వస్తారు. అనంతరం వర్ధన్నపేట నియోజకవర్గ సభకు వెళ్తారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రి సత్యవతి రాథోడ్, ఎమ్మెల్యే శంకర్ నాయక్, ఎంపీ కవిత

ఏర్పాట్ల పర్యవేక్షణ

సీఎం హాజరయ్యే ప్రజా ఆశీర్వాద సభ ఏర్పాట్లను రాష్ట్ర మంత్రి సత్యవతి రాథోడ్ పర్యవేక్షించారు. సభ స్థలం, స్టేజీ ఏర్పాటుపై అభ్యర్థి శంకర్‌నాయక్‌తోపాటు మహబూబాబాద్ ఎంపీ మాలోత్ కవిత, టీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు నూకల నరేష్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ రామ్మోహన్‌రెడ్డి, బీఆర్ఎస్ యూత్ నాయకుడు యాళ్ల మురళీధర్ రెడ్డితో సమీక్షలు నిర్వహించారు. గురువారం సభ ప్రాంగణాన్ని సందర్శించి సూచనలు చేశారు.

భారీగా జన సమీకరణ..

సీఎం సభకు భారీగా జనసమీకరణకు నాయకులు శ్రమిస్తున్నారు. నియోజకవర్గ పరిధిలో నెల్లికుదురు, మహబూబాబాద్ రూరల్, ఇనుగుర్తి, కేసముద్రం, గూడూరు మండలాలతో పాటు మహబూబాబాద్ మున్సిపాలిటీ ఉంది. ఇందులో 161 గ్రామాలు, 36 వార్డుల నుంచి జనాలను తరలించే



ముస్తాబవుతున్న సభా ప్రాంగణం



విధంగా ప్రణాళిక సిద్ధం చేసుకున్నారు. ఒక్కో మండలం నుంచి 12వేల మందికి తగ్గకుండా ఐదు మండలాల నుంచి 60వేలు, మహబూబాబాద్ మున్సిపాలిటీ నుంచి15వేలు మొ త్తంగా 75వేల మందిని సభకు తరలించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు ఎమ్మెల్యే శంకర్‌నాయక్ తెలిపారు.

భారీ బందోబస్తు

రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ హాజరయ్యే సభ కోసం జిల్లా పోలీస్ యంత్రాంగం భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. ఇందుకోసం ఎస్పీ నుంచి ఎస్సై స్థాయి వరకు వంద మంది అధికారుల పర్యవేక్షణతోపాటు, కింది స్థాయి సిబ్బంది 500 మందితో బందోబస్తు నిర్వహించనున్నారు. ఇందుకోసం జిల్లాతో పాటు ఇతర జిల్లాల నుంచి కూడా సిబ్బందిని రప్పించారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం

మహబూబాబాద్ రూరల్: రక్తదానం ప్రాణదా నంతో సమానమని ఎస్పీ సంగ్రామ్ సింగ్ జీ పాటిల్ అన్నారు. పోలీస్ అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా మహబూబాబాద్ టౌన్ పోలీస్ స్టేషన్ ఆవరణలో గురువారం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి సహకారంతో మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. జిల్లాలోని అన్ని స్టేషన్ల పరిధి నుంచి యువకులు ఉత్సాహంగా పాల్గొని రక్తదానం చేశారు. ఎస్పీ సైతం రక్తదానం చేసి మాట్లాడారు. పోలీస్ అధికారులు, పోలీస్ సిబ్బంది, యువకులు స్వచ్ఛందంగా వచ్చి రక్తదానం చేయడం సంతోషంగా ఉందన్నారు. ఆరోగ్యంగా ఉండే ప్రతీ ఒక్కరు రక్తదానం చేయవచ్చన్నారు. రక్తదాన శిబిరం విజయవంతానికి సహకరించిన పోలీస్ సిబ్బంది, ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. ఏఎస్పీ చెన్నయ్య, డీఎస్పీ సత్యనారాయణ, బీఎస్ఎఫ్ డీఎస్పీ ఖుష్వీందర్, ఎస్సైలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



రక్తదానం చేస్తున్న ఎస్పీ పాటిల్

ఆర్టీసీకి రూ.11,11,943 ఆదాయం

నెహ్రూసెంటర్: బతుకమ్మ, దసరా పండుగల సందర్భంగా మహబూబాబాద్ ఆర్టీసీ డిపోకు రూ.11,11,943 ఆదాయం వచ్చిందని డీఎం ఎం.శివప్రసాద్ గురువారం తెలిపారు. మహబూబాబాద్ డిపో ఆధ్వర్యంలో 64 బస్సు సర్వీసులతో 128 టిప్పులు నడిపామన్నారు. ఆర్టీసీకి ఆదాయం చేకూరేందుకు కృషి చేసిన ఉద్యోగులను అభినందిస్తున్నమన్నారు. వంద రోజుల గ్రాండ్ ఫెస్టివల్ చాలెంజ్‌లో భాగంగా మహబూబాబాద్ డిపో మొదటిస్థానంలో ఉండేలా ఉద్యోగులు కృషి చేయాలని, ప్రయాణికులు ఆర్టీసీని ఆదరించాలని కోరారు.

రైతు వ్యతిరేక పార్టీ కాంగ్రెస్

- మంత్రి సత్యవతిరాథోడ్

మహబూబాబాద్: కాంగ్రెస్ పార్టీ రైతు వ్యతిరేకి అని, రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలను జీర్ణించుకోలేకపోతుందని మంత్రి సత్యవతిరాథోడ్ అన్నారు. జిల్లా కేంద్రం శివారు బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డికి రైతాంగ సమస్యలపై అవగాహన లేదని, రైతులకు 3గంటల విద్యుత్ చాలని మాట్లాడిన తీరే ఇందుకు నిదర్శనం అన్నారు. యాసంగిలో రైతుబంధు డబ్బులు రైతుల ఖాతాల్లో జమ చేయవద్దని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేయడం సరికాదన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో జరిగే సీఎం కేసీఆర్ బహిరంగ సభకు కార్యకర్తలు, నాయకులు, ప్రజలు వేలాదిగా తరలిరావాలని కోరారు. సమావేశంలో ఎంపీ మాలోత్ కవిత, ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నూకల నరేష్‌రెడ్డి, నాయకులు పర్కాల శ్రీనివాస్‌రెడ్డి, భరత్‌కుమార్‌రెడ్డి, రంగారావు, ముత్యం వెంకన్న, మహబూబ్‌పాషా తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి సత్యవతిరాథోడ్

నామినేషన్ ప్రక్రియపై అవగాహన అవసరం

- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ శశాంక

మహబూబాబాద్: అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా అభ్యర్థుల నామినేషన్ ప్రక్రియపై రిటర్నింగ్ అధికారులు, సహాయ రిటర్నింగ్ అధికారులకు పూర్తి అవగాహన కలిగి ఉండాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ శశాంక అన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నామినేషన్ ప్రక్రియ, స్క్రూట్నీ, ఉపసంహరణ, గుర్తుల కేటాయింపు, విధివిధానాలపై సంబంధిత అధికారులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. నామినేషన్ దాఖలు ప్రక్రియ మొత్తాన్ని వీడియోగ్రఫీ చేయాలన్నారు. నామినేషన్ దాఖలు సమయంలో అభ్యర్థులు సమర్పించే అఫిడవిట్‌లో ఎలాంటి బ్లాంక్‌లు లేకుండా చూసుకోవాలన్నారు. చెక్‌లిస్ట్ సమర్పించేలా చూడాలన్నారు. సమావేశంలో ఆర్డీఓలు అలివేలు, నర్సింహారావు తదితరులు ఉన్నారు.

పక్కాగా రికార్డు చేయాలి...

ఎన్నికల ప్రచార ఖర్చుల వివరాలు పక్కాగా రికార్డు చేయాలని కలెక్టర్ శశాంక ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో ఎన్నికల వ్యయ పరిశీలకులు, ఎంసీసీ నోడల్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. రాజకీయ పార్టీలు, అభ్యర్థులు ఎన్నికల కోడ్ నియమాలు పాటిస్తూ ప్రచారాల అనుమతులపై రికార్డులను పక్కాగా నిర్వహించాలన్నారు. సభలు, ఇంటింటి ప్రచారాలు, బైక్ ర్యాలీల ఖర్చుల వివరాలను తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ డేవిడ్, ఎంసీసీ నోడల్ అధికారి నర్మద, వ్యయ పరిశీలక నోడల్ అధికారి ఖుర్షీద్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ శశాంక

ఆకస్మిక తనిఖీ

మరిపెడ: మరిపెడలోని ఆర్అండ్‌బీ అతిథిగృహంతో పాటు రిటర్నింగ్ కార్యాలయాన్ని కలెక్టర్ శశాంక ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే ఉన్నతాధికారుల ఏర్పాట్లను పర్యవేక్షించారు. పనులను వేగంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలోని రిటర్నింగ్ అధికారి కార్యాలయాన్ని తనిఖీ చేసి నామినేషన్ల స్వీకరణకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని రిటర్నింగ్ అధికారికి సూచించారు. తొర్రూరు ఆర్డీఓ నర్సింహారావు, పశుసంవర్ధక శాఖ అధికారి సుధాకర్, ఆర్అండ్‌బీ ఈఈ తానేశ్వర్, తహసీల్దార్ సైదులు, మరిపెడ మున్సిపల్ కమిషనర్ రాజు, విద్యుత్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలను పకడ్బందీగా నిర్వహించాలి : కలెక్టర్

మహబూబాబాద్: జిల్లాలో వానకాలం వరి, మొక్కజొన్న, పత్తి కొనుగోలు కేంద్రాలను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ శశాంక అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో కొనుగోలు కేంద్రాలపై నిర్వహణపై కలెక్టర్ శశాంక అదనపు కలెక్టర్ డేవిడ్‌తో కలిసి సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. కొనుగోలు కేంద్రాలకు సంబంధించిన ప్రణాళికను సిద్ధం చేయాలన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. పత్తి కొనుగోళ్ల విషయంలో ముందుగా నిల్వల వివరాలు తెలియజేయాలన్నారు. కేంద్రాల్లో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా తగిన చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న తొర్రూరు సివిల్ కోర్టు మెజిస్ట్రేట్ సరిత

పెద్దవంగర: ప్రజలకు చట్టాలపై అవగాహన అవసరమని తొర్రూరు సివిల్ కోర్టు మెజిస్ట్రేట్ మట్ట సరిత అన్నారు. గురువారం మండలంలోని చిట్యాల, ఉప్పరగూడెం గ్రామాల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమాలకు ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. చట్టాల అవగాహన లేక ప్రజలు నష్టపోతున్నారన్నారు. చిన్నచిన్న తగాదాలకు కోర్టుల వరకు రాకుండా క్షేత్రస్థాయిలోనే పరిష్కరించుకోవాలని పేర్కొన్నారు. న్యాయ సేవాధికార సంస్థను సంప్రదిస్తే మహిళలకు, దివ్యాంగులకు రూ.3 లక్షలలోపు ఆదాయం గల వ్యక్తులకు ఉచితంగా న్యాయ సేవలు అందుతాయన్నారు. కార్యక్రమంలో ఎస్సై రాజు, సర్పంచ్‌లు రావుల శ్రీనివాస్‌రెడ్డి, దుంపల జమున, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ లాలు, వైస్ ప్రెసిడెంట్ అశోక్, సెక్రటరీ నాగేశ్వర్, న్యాయవాదులు కృపావతి, రామకృష్ణ, వెంకటేశ్వర్లు, యాకాంబ్రం, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.


అదుపు తప్పి కారు బోల్తా

నర్సంపేట రూరల్: అదుపు తప్పి కారు బోల్తా పడి ఇద్దరికి తీవ్ర గాయాలైన సంఘటన గురువారం సాయంత్రం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలంలోని ఓటాయికి చెందిన ధనసరి నారాయణ ఓటాయిలో టీచర్‌గా విధులు నిర్వర్తిస్తూ నర్సంపేట పట్టణంలో నివాసం ఉంటున్నాడు. దసరా రోజున నూతన కారు కొనుగోలు చేశాడు. ఆకారులో మరో ఇద్దరితో కలిసి కొత్తగూడ వైపు వెళ్తున్నాడు. నర్సంపేట పట్టణంలోని సర్వాపురం గ్రామానికి చేరుకునే సరికి అదుపు పక్కనే ఖాళీ స్థలంలో బోల్తా పడి దూసుకెళ్లింది. ఈఘటనలో నారాయణతోపాటు రెండు సంవత్సరాల బాలుడు రియాష్‌కు తీవ్రగాయాలయ్యాయి. కాగా, బాలుడు రియాష్ పరిస్థితి విషమంగా ఉండగా వెంటనే వరంగల్ తరలించారు. అక్కడి నుంచి హైదరాబాద్‌కు తరలించారు. ఈ విషయమై నర్సంపేట ఎస్సై రవిని వివరణ కోరగా తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని, ఫిర్యాదు చేసిన వెంటనే కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని తెలిపారు.

దూరవిద్య వెబ్‌సైట్‌లో ఫలితాలేవి?

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని దూరవిద్య డిగ్రీ బీఏ, బీకాం, బీబీఏ, బీఎస్సీ మొదటి, ద్వితీయ, ఫైనలియర్ పరీక్ష ఫలితాలను ఈ నెల 25న పరీక్షల విభాగం అధికారులు విడుదల చేశారు. సంబంధిత ఎస్‌డీఎల్‌సీఈ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు. గురువారం ఆయా ఫలితాలు వెబ్‌సైట్‌లో కనిపించడం లేదని పలువురు విద్యార్థులు అంటున్నారు. దీనిపై అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ నరేందర్‌ను వివరణ కోరగా సర్వర్ డౌన్‌తో ఫలితాలు కనిపించడం లేదని తెలిపారు. ఈ సమస్యను సరిదిద్దాలనుకున్నా కూడా గురువారం ఉద్యోగులు విధులను బహిష్కరించారని, దీంతో పెండింగ్‌లో పడిందన్నారు. శుక్రవారం పరిష్కరించి సర్వర్ డౌన్ కాకుండా చూస్తామని తెలిపారు.

ప్రతి ఒక్కరూ మానవాళిని మార్చాలనే చూస్తారు. తమని తాము మార్చుకోవాలని చూడరు.
- లియోటాల్‌స్టాయ్



ఈ ముచ్చటెరుకేనా?

ఇతర దేశాల్లో ఓటు హక్కు ఇలా..



కాజీపేట: ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధం. ఈ ఓటు హక్కు సద్వినియోగం చేసుకోవాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉంది. ఈ విషయంలో పలు దేశాలు కఠిన నిబంధనలు అమలు చేస్తున్నాయి. అయితే మన దేశంలో ఓటు హక్కు వినియోగంపై ఎలాంటి ఆంక్షలు లేకపోవడం గమనార్హం.

ఆయా దేశాల్లో ఆంక్షలు..

- ఆస్ట్రేలియాలో మూడేళ్లకోసారి పార్లమెంట్ ఎన్నికలు నిర్వహిస్తారు. 18 ఏళ్లకు ఓటు హక్కు కల్పిస్తారు. ఈ దేశంలో ఓటు వేయకపోతే 170 డాలర్ల జరిమానా విధిస్తారు.
- హాంకాంగ్‌లో ఓటు హక్కు వినియోగించుకోకుంటే ఓటరు జాబితాలో పేరు తొలగిస్తారు. ఈ దేశంలో నేరస్తులకు ఓటుహక్కు ఉండదు. ఒక్కసారి తొలగించిన పేరును మళ్లీ ఓటరుగా నమోదు చేసుకోవడం కష్టం.

రూ.3 లక్షల నగదు స్వాధీనం

నర్సంపేట రూరల్ : ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా కారులో తరలిస్తున్న రూ. 3 లక్షల నగదును గురువారం స్వాధీనం చేసుకున్నట్లు నర్సంపేట టౌన్ ఎస్సై శీలం రవి తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. నర్సంపేట మండలం మహేశ్వరం గ్రామానికి చెందిన మోతే దేవి రూ.3 లక్షలు తీసుకుని మహేశ్వరం నుంచి నర్సంపేట వైపునకు కారులో వెళ్తోంది. ఈ క్రమంలో మహేశ్వరం గ్రామ శివారులోని చెక్ పాయింట్ వద్ద పోలీసులు కారును తనిఖీ చేశారు. ఇందులో నగదు లభ్యం కావడంతో వెంటనే సీజ్ చేసి జిల్లా కమిటీకి పంపించినట్లు ఎస్సై తెలిపారు.

జంగ్ తెలంగాణ

పట్టణంలో చాయ్ పోస్తూ పథకాలు వివరిస్తున్న కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి




చాయ్ పోసి.. 'గ్యారంటీ'లు చెప్పి

మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి గురువారం జనగామ పట్టణంలో తిరిగారు. ఓ టీ స్టాల్ వద్ద ఆగి చాయ్ చేసి పలువురికి పోస్తూ ఆరు గ్యారంటీ పథకాలు వివరించారు.
- జనగామ రూరల్

అందరినీ ఆదరించారు..

అన్ని పార్టీలను అక్కున చేర్చుకున్న వర్ధన్నపేట నియోజకవర్గ వాసులు

- పీపుల్స్ డెమోక్రటిక్ ఫ్రంట్ నుంచి బీజేపీ వరకు..
- గ్రామీణం.. పట్టణం కలగలిసిన కాన్‌స్టెన్సీ
- పురుషులతో సమానంగా మహిళా ఓటర్లు..
- రెండు జిల్లాల పరిధిలో నియోజకవర్గం



హసన్‌పర్తి: వర్ధన్నపేట నియోజకవర్గ ప్రజలు అన్నీ పార్టీలను ఆదరిస్తూ వస్తున్నారు. ఇప్పటి వరకు 15 దఫాలు సాధారణ ఎన్నికలు జరిగాయి. ఇందులో పీపుల్స్ డెమోక్రటిక్ ఫ్రంట్ పార్టీ నుంచి.. బీజేపీ వరకు అన్ని పార్టీల అభ్యర్థులను గెలిపించారు. 1952లో తొలిసారి జరిగిన సాధారణ ఎన్నికల్లో పీపుల్స్ డెమోక్రటిక్ ఫ్రంట్ (పీడీఎఫ్) అభ్యర్థి పెండ్యాల రాఘవరావు విజయం సాధించారు. ఆ తర్వాత వరుసగా మూడు సార్లు స్వతంత్ర అభ్యర్థులు గెలుపొందుతూ వచ్చారు. 1978లో జరిగిన సాధారణ ఎన్నికల్లో నియోజకవర్గ ప్రజలు జనతా పార్టీ అభ్యర్థిని అక్కున చేర్చుకున్నారు. ఆ తర్వాత కాంగ్రెస్, బీజేపీ, టీడీపీ, బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులు గెలుపొందుతూ వచ్చారు. ప్రస్తుతం బీఆర్ఎస్ నుంచి గెలిచిన అరూరి రమేష్ ఎమ్మెల్యేగా కొనసాగుతున్నారు. గ్రామీణం, పట్టణాలతో కలగలిసిన నియోజకవర్గం వర్ధన్నపేట. పర్వతగిరి, ఐనవోలు, వర్ధన్నపేట రూరల్ మండలాలు పూర్తిగా గ్రామీణ వాతావరణం కలిగిన ప్రాంతాలు. హసన్‌పర్తితోపాటు ఉమ్మడి హనుమకొండ మండలం పట్టణ వాతావరణం కలిగిన ప్రాంతం.

పునర్విభజనలో ఎస్సీ రిజర్వ్ ..

1952 నుంచి జనరల్ స్థానంగా కొనసాగుతు వస్తున్న వర్ధన్నపేట.. 2009లో జరిగిన పునర్విభజనలో ఎస్సీ రిజర్వ్‌గా కేటాయించారు. ఆ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన కొండేటి శ్రీధర్ విజయం సాధించగా, ఆ తర్వాత తెలంగాణ ఏర్పడిన తర్వాత బీఆర్ఎస్ అభ్యర్థి అరూరి రమేష్ గెలుపొందారు.వరుసగా రెండు దఫాలు ఎమ్మెల్యేగా విజయం సాధించారు.

రెండు జిల్లాల పరిధిలో నియోజకవర్గం..

ప్రస్తుతం వర్ధన్నపేట, హసన్‌పర్తి, ఐనవోలు, పర్వతగిరి మండలాలు పూర్తిగా, హనుమకొండ, కాజీపేట, వరంగల్, ఖిలా వరంగల్ మండలాలు స్వల్పంగా వర్ధన్నపేట నియోజకవర్గంలో కొనసాగుతున్నాయి. వర్ధన్నపేట, పర్వతగిరి, వరంగల్, ఖిలా వరంగల్.. వరంగల్ జిల్లాలో ఉండగా, హనుమకొండ,కాజీపేట, హసన్‌పర్తి, ఐనవోలు మండలాలు హనుమకొండ పరిధిలో ఉన్నాయి.

పురుషులతో సమానంగా మహిళా ఓటర్లు..

ఈ నియోజకవర్గంలో 278 పోలింగ్ బూత్‌లు ఉన్నాయి. మొత్తం ఓటర్ల సంఖ్య 2,55,518. ఇందులో పురుషుల ఓటర్లు 1,27,082 కాగా, మహిళా ఓటర్లు 1,28,421, ఇతర ఓటర్ల సంఖ్య 15.

నియోజకవర్గం మారితేనే మంత్రి పదవి

15 దఫాలు ఎన్నికలు జరిగిన ఈ నియోజకవర్గం నుంచి ఇప్పటికి ఎవరికీ మంత్రి పదవి లభించలేదు. నియోజకవర్గం మారిన తర్వాతే ఎమ్మెల్యేలను మంత్రి పదవి వరించింది. కాంగ్రెస్ నుంచి గెలిచిన పురుషోత్తంరెడ్డి ఆ తర్వాత వరంగల్ ఎమ్మెల్యేగా గెలిచాక మంత్రి పదవి దక్కింది. టీడీపీ నుంచి మూడు సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన దయాకర్‌రావు.. తర్వాత పాలకుర్తి నుంచి ఎన్నికైన తర్వాతే మంత్రి పదవి చేపట్టారు.

వ్యవధి	గెలుపొందిన అభ్యర్థి పేరు	పార్టీ	ఓట్లు	ప్రత్యర్థి అభ్యర్థి	పార్టీ	ఓట్లు
1952--57	పెండ్యాల రాఘవరావు	పీడీఎఫ్	-	-	-	-
1957-62	వెంకటరామనర్సయ్య	ఐఎన్‌సీ	12,965	కె.కాశీనాథం	స్వతంత్ర	7091
1962-67	కె.లక్ష్మీనర్సింహారెడ్డి	స్వతంత్ర	10,073	పెండ్యాల రామారావు	సీపీఐ	8628
1967-72	టి.పురుషోత్తమరావు	స్వతంత్ర	22,966	పి.వి. రెడ్డి	ఐఎన్‌సీ	18991
1972-77	టి.పురుషోత్తమరావు	స్వతంత్ర	19,981	ఆరెల్లి బుచ్చయ్య	ఐఎన్‌సీ	18991
1978-83	మాచర్ల జగన్నాథం	జేఎన్‌పీ	24,113	పురుషోత్తమరావు	ఐఎన్‌సీ	20118
1983-85	మాచర్ల జగన్నాథం	ఐఎన్‌సీ	27,232	వన్నాల శ్రీరాములు	బీజేపీ	20960
1985-89	వన్నాల శ్రీరాములు	బీజేపీ	39,097	వరదరాజేశ్వర్‌రావు	ఐఎన్‌సీ	25571
1989-94	తక్కళ్లపల్లి రాజేశ్వర్‌రావు	బీజేపీ	39,118	వరదరాజేశ్వర్‌రావు	ఐఎన్‌సీ	29052
1994-99	ఎర్రబెల్లి దయాకర్‌రావు	టీడీపీ	54,029	వరదరాజేశ్వర్‌రావు	ఐఎన్‌సీ	31854
1999-2004	దయాకర్‌రావు	టీడీపీ	62,581	ఎర్రబెల్లి స్వర్ణ	ఐఎన్‌సీ	50998
2004-2009	దయాకర్‌రావు	టీడీపీ	73,022	ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి	జేపీ	47928
2009-2014	కొండేటి శ్రీధర్	కాంగ్రెస్	57,871	విజయరామారావు	టీఆర్ఎస్	51287
2014-2018	అరూరి రమేష్	బీఆర్ఎస్	1,17,254	కొండేటి శ్రీధర్	కాంగ్రెస్	30905
2018- 2023	అరూరి రమేష్	బీఆర్ఎస్	1,31,252	పగిడిపాటి దేవయ్య	జనసమితి	32012

నేడు బీఆర్ఎస్‌లోకి మాజీ ఎమ్మెల్సీ సావిత్రమ్మ

కేసముద్రం: ఇనుగుర్తి మండల కేంద్రానికి చెందిన మాజీ ఎమ్మెల్సీ గండు సావిత్రమ్మ శుక్రవారం మానుకోట సభలో సీఎం సీఎం కేసీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరనున్నారు. మహబూబాబాద్ ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్, బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నూకల నరేష్‌రెడ్డి, రాష్ట్ర నేత వద్దిరాజు కిషన్, మార్క్‌ఫెడ్ రాష్ట్ర డైరెక్టర్ మర్రి రంగారావు, ఎమ్మెల్యే సతీమణి సీతామహాలక్ష్మీతో పాటు మండల నాయకులు గురువారం సావిత్రమ్మ ఇంటికి వెళ్లి బీఆర్ఎస్‌లోకి ఆహ్వానించగా ఆమె సానుకూలంగా స్పందించారు. కాగా, టీడీపీ రాష్ట్ర నాయకురాలిగా కొనసాగుతున్న ఆమె, తన అనుచరులతో కలిసి బీఆర్ఎస్‌లో చేరనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఇనుగుర్తి ఎలక్షన్ ఇన్‌చార్జ్ జాటోత్ హరీశ్‌నాయక్, ఎంపీపీ వోలం చంద్రమోహన్, జెడ్పీటీసీ రావుల శ్రీనాథ్‌రెడ్డి, కేసముద్రం పీఏసీఎస్ చైర్మన్ దికొండ వెంకన్న, పార్టీ మండల అధ్యక్షుడు నజీర్‌అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.



సావిత్రమ్మతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకర్‌నాయక్

సీజ్ చేసిన డబ్బు విడుదల

వరంగల్: ఎన్నికల కోడ్ అమలులో భాగంగా సీజ్ చేసిన రూ.37,01,750 నగదును గ్రీవెన్స్ కమిటీ ద్వారా విడుదల చేసినట్లు జిల్లా ఎన్నికల గ్రీవెన్స్ మానిటరింగ్ కమిటీ కన్వీనర్ బి.సంజీవరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటి వరకు జిల్లా గ్రీవెన్స్ సెల్ ద్వారా 27 కేసులకు సంబంధించి రూ.44,75,800 నగదు సీజ్ చేయగా 25 కేసులకు సంబంధించిన రూ.37,01,750ను విడుదల చేసినట్లు తెలిపారు. మరో రెండు కేసులు ఆధారాలు సమర్పించిన వెంటనే విడుదల చేస్తామన్నారు. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో స్వాధీనం చేసుకున్న నగదు, ఇతర వస్తువులను తిరిగి అప్పగించాలంటే ఆధారాలు చూపించాలని, గ్రీవెన్స్ కమిటీ ద్వారా కేసుల పరిష్కారం త్వరితగతిన చేపడుతామన్నారు. జిల్లాలోని వరంగల్ తూర్పు, వర్ధన్నపేట, నర్సంపేట నియోజక వర్గాల్లో ఫ్లయింగ్ స్క్వాడ్లు, పోలీసులు, ఎక్సైజ్ అధికారులు స్వాధీనం చేసుకున్న నగదు, ఇతర వస్తువులకు సంబంధించిన ఆధారాలు అందిస్తే సీజ్ చేసిన 24 గంటల లోపు జిల్లా గ్రీవెన్స్ మానిటరింగ్ సెల్ ద్వారా అందిస్తామన్నారు. ఫ్లయింగ్ స్క్వాడ్స్, పోలీసులు సీజ్ చేసిన డబ్బుకు సంబంధిత వ్యక్తికి కచ్చితంగా రశీదు ఇస్తూ.. జిల్లా గ్రీవెన్స్ సెల్ చిరునామా, ఫోన్ నంబరు ఇవ్వాలని తెలిపారు. నగదుకు సంబంధించిన ఎలాంటి గ్రీవెన్స్ ఉన్నా 9100 15737 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

ఎన్నికల ఖర్చు వివరాలు నమోదు చేయాలి

- కలెక్టర్ సిక్తా పట్నాయక్

హన్మకొండ: శాసనసభ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల ఖర్చు వివరాలు పారదర్శకంగా నమోదు చేయాలని హనుమకొండ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఆదేశించారు. గురువారం హనుమకొండ కలెక్టరేట్‌లో వరంగల్ పోలీసు కమిషనర్ అంబర్ కిశోర్ ఝాతో కలిసి అకౌంటింగ్ టీమ్, ఎస్.ఎస్.టి, వి.ఎస్.టి, వీవీటీ టీమ్ అధికారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రెండు నియోజకవర్గాల పరిధిల్లో పోలీసు, ఫ్లయింగ్ స్క్వాడ్స్ తనిఖీలు నిర్వహించి రూ. 14 కేసులు నమోదు చేయగా, నేటి వరకు రూ.37,87,201 నగదును సీజ్ చేసినట్లు తెలిపారు. సీజ్ చేసిన 10 కేసులకు సంబంధించిన రూ.33,96,501 జిల్లా గ్రీవెన్స్ కమిటీ విడుదల చేసిదన్నారు. కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ శ్రద్ధ శుక్లా, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి ఎ.శ్రీనివాస కుమార్, ఐటీ ఆఫీసర్ చక్రధర్, జిల్లా సహకార అధికారి జి.నాగేశ్వర్ రావు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన కలెక్టర్..

వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలోని పలు పోలింగ్ కేంద్రాలను కలెక్టర్ సిక్తా పట్నాయక్ పరిశీలించారు. అంతకు ముందు కలెక్టరేట్‌లో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతూ పోలింగ్ సిబ్బందికి సంబంధించిన మొదటి దశ ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తయిందన్నారు. కార్యక్రమంలో సీపీఓ సత్యనారాయణ రెడ్డి, ఎస్ఐసీ అధికారి విజయ్ కుమార్, జిల్లా విద్యాశాఖాధికారి అబ్దుల్ హై పాల్గొన్నారు.

భార్యాభర్తల బలవన్మరణం

పొరుగు వారు అవమానించారనే మనస్తాపంతో ఆత్మహత్య



రాజ్‌కుమార్-మాధవి (ఫైల్)

గీసుకొండ: కాలనీలో ఉండే పొరుగు వారు మానసిక వేదనకు గురిచేయడంతో మనస్తాపానికి గురైన భార్యాభర్తలిద్దరూ బలవన్మరణానికి పాల్పడ్డారు. ఈ ఘటన గ్రేటర్ వరంగల్ పరిధిలో గురువారం వెలుగులోకి వచ్చింది. మృతుల బంధువులు, గీసుకొండ పోలీసుల కథనం ప్రకారం.. హనుమకొండ జిల్లా శాయంపేట మండలం గంగిరేణిగూడేనికి చెందిన గండి రాజ్‌కుమార్(47), మాధవి(24) దంపతులు కొన్నేళ్ల క్రితం బతుకుదెరువు కోసం కూలి పని కోసం గ్రేటర్ వరంగల్ నగరం 16వ డివిజన్ కీర్తినగర్ కాలనీకి వచ్చి అక్కడే అద్దె ఇంటిలో నివాసం ఉంటున్నారు. వారికి కూతురు, కుమారుడు ఉన్నారు. ఈ నెల 22న సాయంత్రం అదే కాలనీకి చెందిన పోతునూరి మౌనిక.. వాలి పాషా అనే వ్యక్తితో గండి మాధవి వివాహేతర సంబంధం కలిగి ఉందని అతని భార్యకు చెప్పింది. దీంతో వాలిపాషా భార్య మాధవిని, ఆమె భర్త రాజ్‌కుమార్‌ను తీవ్ర పదజాలంతో దూషించింది. ఎందుకు బతుకుతున్నారని, తన భర్తతో వివాహేతర సంబంధం పెట్టుకోవడానికి సిగ్గులేదా అంటూ నిందించింది. దీంతో మనస్తాపం చెందిన వారు మానసికంగా కుంగిపోయి ఈ నెల 24న సాయంత్రం ఇంటి వద్ద పురుగుల మందు తాగారు. అపస్మారక స్థితికి చేరుకున్న వారిని 108 అంబులెన్స్ వాహనంలో వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం(25న) రాత్రి మృతిచెందారు. వారి మృతికి కారణమైన వాలిపాషా భార్య, పోతనూరి మౌనికపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని మృతుల బంధువులు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు గీసుకొండ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ తెలిపారు.



చెరువులో నీటమునిగి విద్యార్థి మృతి



ఉదయ్‌కిరణ్ (ఫైల్)

దంతాలపల్లి : సరదాగా చెరువులో దిగిన ఓ విద్యార్థి నీట మునిగి మృతి చెందాడు. ఈ ఘటన గురువారం మహబూబాబాద్ జిల్లా దంతాలపల్లి మండలం రేపోనిలో జరిగింది. గ్రామానికి చెందిన మారుకంటి వెంకన్న, సుకన్య దంపతులకు కూతురు ఉదయస్త్రీ, కుమారుడు ఉదయ్‌కిరణ్ (17) ఉన్నారు. కాగా, పది నెలల క్రితం అనారోగ్యాల కారణాలతో వెంకన్న మృతిచెందగా గ్రామంలో బతుకుదెరువు లేకపోవడంతో సుకన్య పిల్లలను తీసుకుని జీవనోపాధి కోసం హైదరాబాద్ వెళ్లింది. అక్కడ కూలీ పనులు చేసుకుంటూ పిల్లలను చదివించుకుంటోంది. ఉదయ్‌కిరణ్ ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. ఈ క్రమంలో పండుగకు సెలవులు రావడంతో తన బాబాయి కమలాకర్‌తో రేపోని వచ్చాడు. అయితే గురువారం ఉదయం ఎవరి తోడు లేకుండా చెరువు దగ్గరకు వెళ్లి సరదాగా అందులో దిగి నీట మునిగి మృతి చెందాడు. ఉదయ్‌కిరణ్ ఎంతకూ రాకపోవడంతో కుటుంబీకులు పలుచోట్ల వెతికారు. అయినా ఆచూకీ లభ్యం కాలేదు. ఈ క్రమంలో సుమారు 3 గంటల ప్రాంతంలో గ్రామస్తుడు చెరువు వైపు నుంచి వెళ్తున్న క్రమంలో ఇయర్‌ఫోన్స్ లభించాయి. దీంతో కుటుంబీకులకు చూపించాడు. వారు చెరువులో గాలించగా ఉదయ్‌కిరణ్ మృతదేహం లభించింది. దీంతో కన్నీరుమున్నీరుగా విలపించారు.

సౌత్ ఇండియన్ హిస్టరీ కాంగ్రెస్ సదస్సుకు ప్రొఫెసర్ మనోహర్



ప్రొఫెసర్ టి.మనోహర్

కేయూ క్యాంపస్: కేరళ రాష్ట్రంలోని తిరువనంతపురం సెంట్రల్ యూనివర్సిటీలో ఈనెల 28నుంచి 30వ తేదీ వరకు జరగనున్న 42వ సౌత్ ఇండియన్ హిస్టరీ కాంగ్రెస్ సదస్సులో కాకతీయ యూనివర్సిటీ హిస్టరీ విభాగం అధిపతి, సోషల్‌సైన్స్ డీన్ ఆచార్య టి.మనోహర్ కీలకోపన్యాసం చేయనున్నారు. 'ఏ పీప్ ఇన్ టు ది సోషల్ హిస్టరీ యాస్ పోర్ట్‌రాయిడ్ ఇన్ తెలుగు ప్రావెర్బ్స్' అనే అంశంపై ప్రసంగించనున్నట్లు మనోహర్ గురువారం యూనివర్సిటీలో వెల్లడించారు.


అధికారులు నిబద్ధతతో పని చేయాలి

- టీఎస్ ఎన్పీడీసీఎల్ సీఎండీ గోపాల్ రావు



హన్మకొండ: అధికారులు నిబద్ధతతో పని చేసి కంపెనీ అభివృద్ధికి కృషి చేయాలని టీఎస్ ఎన్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ అన్నమనేని గోపాల్ రావు అన్నారు. గురువారం హనుమకొండ నక్కలగుట్టలోని టీఎస్ ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయంలో కార్పొరేట్ కార్యాలయ సీజీఎంలు, 16 జిల్లాల సూపరింటెండెంట్ ఇంజనీర్లు, సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్స్, తహసీల్దార్ల సమీక్ష నిర్వహించారు. జిల్లాల వారీగా విభాగాల ప్రగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెక్షన్ల వారీగా ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ స్టాఫ్‌కు అవగాహన కల్పించాలన్నారు. సబ్ స్టేషన్లు, లైన్ల నిర్వహణ చేపట్టాలని, వాటిలో సమస్యలు గుర్తించి పరిష్కరించాలన్నారు. ఎప్పటికప్పుడు ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతులు చేపట్టాలన్నారు. ఈఆర్‌ఓ వారీగా సమన్వయ సమావేశాలు ఏర్పాటు చేయాలన్నారు. ఫీడర్ల పరంగా నష్టాలు తగ్గించాలన్నారు. వ్యవసాయ సర్వీస్‌లకు కెపాసిటర్ బ్యాంకులు బిగించాలన్నారు. రెవెన్యూ కలెక్షన్లు వందశాతం చేపట్టాలన్నారు. సమావేశంలో డైరెక్టర్లు బి.వెంకటేశ్వరరావు, పి.గణపతి, పి. సంధ్యారాణి, పి.మోహన్ రెడ్డి, వి. తిరుపతిరెడ్డి, చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ బి.జనార్దన్, సీజీఎంలు టి.సదర్‌లాల్, బి.అశోక్ కుమార్, మధుసూదన్, మోహన్ రావు, అశోక్, సి.ప్రభాకర్, కిషన్, భీకంసింగ్, రవీంద్రనాథ్ పాల్గొన్నారు.

కేయూలో ఉద్యోగుల విధుల బహిష్కరణ



ర్యాలీ నిర్వహిస్తున్న వివిధ ఉద్యోగ సంఘాల బాధ్యులు

- హామీ నెరవేర్చని రిజిస్ట్రార్‌ను తొలగించాలని డిమాండ్

కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీలో ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో కేయూ ఎన్‌జీఓ , క్లాస్‌ఫోర్త్ ఎంప్లాయిస్ యూనియన్ల బాధ్యులతో గత నెలలో చర్చలు జరిపి పలు డిమాండ్లకు హామీ ఇచ్చి నెలరోజులు గడిచినా పరిష్కరించకపోవడంతో గురువారం ఉద్యోగులు విధులు బహిష్కరించారు. హామీ నెరవేర్చని రిజిస్ట్రార్ శ్రీనివాస్‌రావును బాధ్యతల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. కేయూ ఎన్‌జీవో సంఘం అధ్యక్షుడు లకావత్‌యాదగిరి, జనరల్‌సెక్రటరీ వల్లాల తిరుపతి, క్లాస్‌ఫోర్త్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు అబ్దుల్‌షుకూర్, జనరల్‌సెక్రటరీ కొర్నెలు, ఆయా సంఘాల బాధ్యులు.. క్యాంపస్‌లోని లైబ్రరీ ప్రాంతం నుంచి ర్యాలీగా పరీక్షల విభాగంలోకి వెళ్లారు. అనంతరం వివిధ డిపార్ట్‌మెంట్ల ఉద్యోగులను విధులు బహిష్కరింపజేశారు. ఈ సందర్భంగా తిరుపతి మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యలపై ఆందోళన బాటపట్టేందుకు యత్నించగా కేయూ రిజిస్ట్రార్ శ్రీనివాస్‌రావు గతనెల 24వ తేదీన చర్చలు జరిపారన్నారు. అందులో కొన్ని డిమాండ్ల పరిష్కారానికి హామీ ఇచ్చారన్నారు. అయితే నెలరోజులు గడిచినా ఇప్పటికీ హామీని నెరవేర్చలేదన్నారు. అందుకే రిజిస్ట్రార్‌ను పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మహ్మద్ యూనస్, సతీష్ బాబు, తోట ప్రభాకర్, జి నిరంజన్, అంకూస్, రామనాథం, వేణు, మల్లికాంబ, విష్ణువర్దన్ , సుధాకర్, రాంచందర్, రవి, శివప్రసాద్, సురేష్ పాల్గొన్నారు.

స్తంభించిన పాలన

పరీక్షల విభాగం, పరిపాలనాభవనంలో ఉద్యోగులను విధులు బహిష్కరింపజేయడంతో యూనివర్సిటీలో పాలన స్తంభించింది. పరీక్షల విభాగానికి విద్యార్థులు వివిధ సర్టిఫికెట్ల కోసం వస్తుంటారు.వీరు ఇబ్బంది పడ్డారు.

నిరసనలు చేపట్టొద్దు..

రాష్ట్రంలో ఎన్నికల నేపథ్యంలో మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమలు ఉన్న దృష్ట్యా కాకతీయ యూనివర్సిటీలో నిరసన, సమ్మెలు చేపట్టొద్దని రిజిస్ట్రార్ శ్రీనివాస్‌రావు ఆదేశించారు. ఈ మేరకు గురువారం రాత్రి ఉత్తర్వులు జారీచేశారు. గురువారం యూనివర్సిటీలో కార్యాలయాలు, వివిధ విభాగాలను విశ్వవిద్యాలయ బోధనేతర ఉద్యోగ సంఘాల ఆఫీస్ బేరర్లు మూసివేశారని, దీంతో ఈ ఉత్తర్వులు విడుదల చేసినట్లు ఆయన తెలిపారు. డిసెంబర్ 5వ తేదీ వరకు ఉద్యోగులు ఎలాంటి నిరసన, సమ్మెలు కొనసాగించొద్దన్నారు.

రూ.5.50 లక్షల విలువైన గంజాయి పట్టివేత



నిందితుడి వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ కిషన్

వరంగల్: వరంగల్ రైల్వేస్టేషన్ ఎదుట ఇంతేజార్ గంజ్ పోలీసులు గురువారం ఉదయం ఒడిశాలోని రాయగఢ్ జిల్లా ఎంకెరాయి సర్గిగూడ గ్రామానికి చెందిన గౌరబ్‌పలక అనే వ్యక్తి వద్ద నుంచి సుమారు రూ.5.50 లక్షల విలువైన 22 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు వరంగల్ ఏసీపీ బోనాల కిషన్ తెలిపారు. ఈ మేరకు ఇంతేజార్‌గంజ్ పోలీసుస్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. రైల్వేస్టేషన్ ఎదుట ఉన్న ఓ వ్యక్తి వద్ద గంజాయి ఉందని ఆర్‌పీఎఫ్ పోలీసులు అందించిన సమాచారం మేరకు ఎస్సై కొమురెల్లి, సిబ్బంది శివకృష్ణ, కమ్రోద్దీన్, ఎ.రాజు ఘటనా స్థలికి చేరుకున్నారు. అక్కడ ప్రయాణికుల బ్యాగులు తనిఖీ చేస్తుండగా ఓ వ్యక్తి అక్కడి నుంచి పారిపోతుండగా పట్టుకున్నారు. అనంతరం అతడి బ్యాగు తనిఖీ చేయగా గంజాయి లభించింది. దీంతో నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. కాగా, నిందితుడిని పట్టుకున్న సీఐ,ఎస్సై సిబ్బంది, ఆర్‌పీఎఫ్ పోలీసులను సెంట్రల్‌జోన్ డీసీపీ ఎం.ఎ.బారీ, ఏసీపీ బోనాల కిషన్ అభినందించారు.

1న ఉమ్మడి జిల్లాస్థాయి ఖోఖో ఎంపికలు

హన్మకొండ: వచ్చే నెల (నవంబర్) 1వ తేదీన ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి సబ్ జూనియర్స్ ఖోఖో ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు ఖోఖో అసోసియేషన్ వరంగల్ జిల్లా కార్యదర్శి శ్యాంప్రసాద్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో నిర్వహించే ఎంపికల్లో పాల్గొనే క్రీడాకారులు ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన వారై ఉండాలన్నారు. డిసెంబర్ 17, 2023 నాటికి 14 సంవత్సరాలలోపు వయసు కలిగి ఉండాలని తెలిపారు. ఇందులో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు నవంబర్ 15 నుంచి 17వ తేదీ వరకు మెదక్ జిల్లా తూప్రాన్‌లో జరుగనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు తమ వెంట జనన ధ్రువీకరణ పత్రం తీసుకుని రావాలని సూచించారు. మరిన్ని వివరాలకు 98492 10746 నంబర్‌లో సంప్రదించాలని తెలిపారు.